సాక్షి
వైఎస్సార్ జిల్లా

ఆదివారం । 3 । నవంబర్ । 2024



చైన్ స్నాచర్ అరెస్టు

పలు చోట్ల మహిళల మెడలోని బంగారు గొలుసులను లాక్కెళ్లిన ఓ చైన్ స్నాచర్‌ను మైదుకూరు అర్బన్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. -8లో



నాలుగేళ్ల వరకు అవిశ్వాస తీర్మానం ఉండదు

జీఓ 835 ప్రకారం కౌన్సిల్ ఏర్పడిన నాలుగేళ్ల వరకు అవిశ్వాస తీర్మానం పెట్టడానికి అవకాశం లేదని రాచమల్లు తెలిపారు. -8లో

గరిష్టం/కనిష్టం
34.2/24.2

వాతావరణం

జిల్లాలో శనివారం 24.2 – 34.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రేపు కలెక్టరేట్ ఎదుట ఆందోళన

కడప వైఎస్సార్ సర్కిల్: జిల్లాలో గ్రామ సేవకులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని ఈ నెల 4 న కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ వీఆర్ఏ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్ తెలిపారు. శనివారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 8 ఏళ్లుగా వీఆర్ఏలకు వేతనాలు పెంచలేదని తెలిపారు. చట్ట విరుద్ధంగా నైట్ డ్యూటీలు వేస్తున్నారన్నారు. అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ వీఆర్ఏ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగేంద్ర, వెంకటపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ, జిల్లా కోశాధికారి అశోక్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: ఏపీఎస్ఆర్టీసీ కడపలో అప్రెంటిస్ చేయటకు ఆసక్తి కలిగి ఉన్న అభ్యర్థులు ఈ నెల 5వ తేదీ నుంచి 19వ తేదీలోగా ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ డీఎల్‌టీసీ ఐటీఐ అసిస్టెంట్ డైరెక్టర్ రత్నరాజు తెలిపారు. ఈ దరఖాస్తులను www.apprenticeshipindia.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందులో మెకానిక్ డీజల్ -40, మెటార్ మెకానిక్ వెహికల్-9, ఎలక్ట్రీషియన్ -5, వెల్డర్-2, ఫిట్టర్-3, డ్రాఫ్‌మెట్ సివిల్-1, మెషినిస్టు-5 ఇలా మొత్తంగా 65 ఖాళీలు ఉన్నాయని ఆయన వివరించారు. ఈ అవకాశాన్ని ప్రతి అభ్యర్థి సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే అప్రెంటిస్ షిప్ అడ్వైజర్‌ను సంప్రదించాలని డీఎల్‌టీసీ అసిస్టెంట్ డైరెక్టర్ రత్నరాజు తెలిపారు.

15న అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: పుష్య పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 15న అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు ఆర్టీసీ బస్టాండు నుంచి బస్సులు బయలుదేరుతాయని ఆయన పేర్కొన్నారు. అల్ట్రా డీలక్స్ బస్సులకు రాను, పోను టిక్కెట్టు రూ.805 చెల్లించాలన్నారు. టిక్కెట్లు కావాల్సిన వారు 7382875034, 7981753344, 9440858510ను సంప్రదించాలని వివరించారు.

వైవీయూ ఎంబీఏ పరీక్షా ఫలితాలు విడుదల



ఎంబిఏ ఎంబీఏ హెచ్ఆర్ఎం పలితాలను విడుదల చేస్తున్న వీసీ కృష్ణారెడ్డి తదితరులు

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం ఎంబీఏ, ఎంబీఏ హెచ్ఆర్ఎం నాల్గవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను శనివారం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కేఎస్వీ కృష్ణారావు, ఎంబీఏ విభాగ డీన్ ప్రొఫెసర్ వై.సుబ్బరాయుడులతో కలిసి విడుదల చేశారు. వైవీయూలోని తన చాంబర్లో ఫలితాల విడుదల సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంబీఏలో, ఎంబీఏ హెచ్ఆర్ఎం లో వందశాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, అధ్యాపకులను వీసీ అభినందించారు.

రెడ్డెమ్మ X పుత్తా

- అధికార పార్టీ ఎమ్మెల్యేల మధ్య కోల్డ్‌వార్
- ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి మద్యం షాపు ఏర్పాటుపై పరస్పర ఫిర్యాదు
- బడి, గుడి ఫిర్యాదుతో 100 మీటర్లు అవతలికి షాపులు సర్దుబాటు
- అనుమతులు లేని భవనమంటూ కార్పొరేషన్ అధికారులను ఉసిగొల్పిన వైనం

సాక్షి ప్రతినిధి, కడప: అధికార పార్టీ ఎమ్మెల్యేల మధ్య కోల్డ్‌వార్ నడుస్తోంది. తాజాగా మద్యం షాపుల ఏర్పాటు విషయంలో ఈ వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. ముఖ్యంగా కడప నగరంలోని బిల్టప్ సమీపంలో మద్యంషాపు ఏర్పాటుపై కడప, కమలాపురం ఎమ్మెల్యేల వర్గీయులు పరస్పర ఫిర్యాదులు హాట్ టాఫిక్‌గా మారాయి.

కడపలో టీడీపీ కార్యకర్తలు మినహా మరెవ్వరూ మద్యం టెండర్లు వేయరాదంటూ ముందస్తు బెదిరింపులు వచ్చాయి. ఈ పరిస్థితుల్లో చూద్దామని కొంతమంది సాహసం చేసి దరఖాస్తులు వేశారు. మరికొంతమంది పొరుగున ఉన్న అధికారపార్టీ నేతల మద్దతుతో పాల్గొన్నారు. టెండర్లు ప్రక్రియ ముగియగానే మద్యం షాపులు లభించిన వారందరూ వచ్చి మాట్లాడాలని కడప ముఖ్యనేత కబురు పెట్టారు. మెజార్టీ లాటరీ విజేతలు సంప్రదింపులు చేపట్టారు. తమ వర్గీయుల భాగస్వామ్యం తప్పనిసరి అంటూ కలిసినవారికి సదరు నేత హుకుం జారీ చేశారు. దీనికి కొందరు అంగీకరించారు, మరికొందరు తిరస్కరించారు. ఇలాంటి పరిస్థితుల్లో బిల్టప్ సమీపంలో లాటరీ విజేతలు రెండు షాపులు ఏర్పాటు చేశారు. రెడ్డి, మౌర్య వైన్స్ పేరుతో వెలిశాయి. ఈ రెండింటిలో ఒకటి కడప, మరొకటి కమలాపురం ఎమ్మెల్యేల మద్దతుదారులవి. అప్పటికే అక్కడ గోసుల బార్‌అండ్‌రెస్టారెంట్ ఒకటి ఉండిపోయింది.

ఒకటి ఎత్తివేయాలని..

ఒకటే చోట మూడు మద్యం దుకాణాలు ఉండడంతో అక్కడి నుంచి ఒకటి ఎత్తేయిస్తే వ్యాపారం సవ్యంగా ఉంటుందనే ఆలోచన ఓ వర్గం వారిలో మెదిలింది. అంతే వెంటనే బడి, గుడి నిబంధనలను తెరపైకి తెచ్చి ఫిర్యాదు చేశారు. ఆమేరకు ముందుగా ఏర్పాటు చేసుకున్న స్థలం నుంచి మౌర్య వైన్స్ తరలించాల్సి వచ్చింది. గోసుల బార్ స్కూల్ ఏర్పాటు కంటే ముందుగా అక్కడ నిర్వహిస్తుండడంతో దానికి ఆ నిబంధన వర్తించలేదు. ఇక మౌర్య వైన్స్ కాస్త దూరంలో ఉన్న ఓ భవనంలో ఏర్పాటు చేసుకునేందుకు శ్రీకారం చుట్టారు. ఈ వైన్‌షాపును అక్కడి నుంచి కూడా లేకుండా చేయాలని కడప ఎమ్మెల్యే వర్గీయులు వ్యూహం పన్నారు.



భవనానికి అనుమతులు లేవంటూ..

అధికార పార్టీ ఎమ్మెల్యే చిటికేస్తే కార్పొరేషన్ అధికారులు పరుగులు పెడుతున్నారు. గత కొన్ని ఘటనలు అందుకు దర్పంగా నిలుస్తున్నాయి. తాజాగా మౌర్య వైన్స్ ఏర్పాటు చేస్తున్న భవనానికి నిర్మాణ అనుమతులు లేవంటూ కార్పొరేషన్ యంత్రాంగం అడ్డు తగిలింది. భవన యజమానికి నోటీసులు పంపి, ఎందుకు కూల్చకూడదో తెల్పాలంటూ అక్కడికి వెళ్లారు.

అధికారులను నిర్బంధించిన 'పుత్తా'

విషయం తెలుసుకున్న టీడీపీ నేత.. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్య తండ్రి పుత్తా నరసింహారెడ్డి వెంటనే సదరు అధికారులకు ఫోన్ చేసి పక్కనే ఉన్న ఎమ్మెల్యే ఆఫీసుకు రావాల్సిందిగా పిలిచారు. అక్కడికి వెళ్లిన అధికారులకు పట్టపగలు చుక్కలు చూపించారు. 'ఆ భవనానికి నిర్మాణ అనుమతులున్నాయి. ఒకవేళ లేకపోయినా 40ఏళ్ల క్రితం నిర్మించారు, ఇంతకాలం ఏమి చేస్తున్నారు? ఇప్పుడెందుకు వచ్చారు? మిమ్మల్ని పంపించిన వారిని ఇక్కడికి పిలచండి? అప్పటి వరకూ మీరు ఇక్కడే ఉండండం'టూ నిర్బంధించారు. ఏమి చేయాలో పాలుపోక ఆ వచ్చిన అధికారులు అక్కడే ఉండిపోయారు. ఉన్నతాధికారులు అటువైపు కూడా వచ్చే పరిస్థితి కన్పించడం లేదు. దాదాపు 2గంటలు పాటు కార్పొరేషన్ యంత్రాంగం స్థానికంగా ఉన్న పుత్తా కార్యాలయంలో ఉండిపోవాల్సి వచ్చింది. ఈలోపు భవన యజమాని నిర్మాణ అనుమతులు తీసుకురావడంతో మరింత స్థాయిలో బూతులు తినాల్సివచ్చింది.

వ్యవహారం బెడిసికొట్టడడంతో....

కార్పొరేషన్ అధికారుల వ్యవహారం బెడిసి కొట్టడంతో కడప ఎమ్మెల్యే వర్గీయులు మరో వ్యూహం పన్నారు. ఈమారు ఆభవనంలో అద్దెకు నివాసం ఉన్నవారితో ఇక్కడ మద్యం షాపు ఏర్పాటు చేయవద్దంటూ ఫిర్యాదు చేయించారు. దీంతో కోపోద్రిక్తులైన కమలాపురం ఎమ్మెల్యే వర్గీయులు ఫిర్యాదుదారుడికి తగిన రీతిలో బుద్ధి చెప్పినట్లు సమాచారం. వెంటనే ఆ ఫిర్యాదును ఉపసంహరించుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో 'ఈ ముసుగులో వ్యవహారం ఎందుకు ప్రత్యక్షంగా తెరపైకి రండి.. తేల్చుకుందా'మంటూ కమలాపురం ఎమ్మెల్యే వర్గీయులు సవాల్ విసరడం కొసమెరుపు.

బాబోయ్.. మందుబాబులు

మందుబాబులు చెలరేగుతున్నారు. పట్టపగలు నడిరోడ్లపైనే విచ్చలవిడిగా మద్యం తాగుతూ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడ .. డివైడర్ల పక్కన, కూల్‌డ్రింక్ షాపుల్లో బహిరంగంగా తాగుతున్నారు. వెరసి రహదారుల్లో ప్రయాణించే మహిళలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కడపలో ముందే పది బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. ఆపై 23 మద్యం షాపులు కొత్తగా వచ్చాయి. వ్యాపారం అనువుగా ఉన్న ప్రాంతాలల్లో యజమానులు మద్యంషాపులు ఏర్పాటు చేసుకున్నారు. గతంలో అక్కడడక్కడ బార్లు ఉండడంతో మందుబాబుల వల్ల ఎవ్వరికీ ఎలాంటి ఆటంకాలు లేవు. ప్రస్తుతం కడపలో డివైడర్లు చెంతన, రోడ్డు పక్కలో, కూల్‌డ్రింక్ షాపులల్లో తిష్టవేసి మందు తాగుతుండడంతో ప్రజానీకం ఇబ్బందిపడుతోంది.



పరస్పర ఒప్పందం కుదిరితేనే...

మద్యం షాపుల చెంతలో తాగేందుకు అనుమతులుంటే మందుబాబులు అక్కడే తాగేసి వెళ్తుండేవారు. ఎటూ విచ్చలవిడిగా మద్యం విక్రయాలకు ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పర్మిట్ రూమ్‌కు అనుమతి ఇవ్వడం శ్రేయస్కరమని పలువురు వివరిస్తున్నారు. అప్పటివరకూ బహిరంగ మద్యం తాగుడును కట్టడి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ప్రధానంగా జిల్లా కేంద్రమైన కడప, ప్రొద్దుటూరు లాంటి పట్టణాలల్లో ఈబెడద ఎక్కువగా ఉండడం గమనార్హం.

గుంతల రహిత జిల్లాగా మార్చాలి

ఇంచార్జి కలెక్టర్ అదితిసింగ్



పనులను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా వ్యాప్తంగా గోతులు పడిన రహదారులకు మరమ్మతులు చేపట్టి గుంతల రహిత జిల్లాగా తీర్చిదిద్దుతామని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక వై జంక్షన్ కూడలి వద్ద మిషన్ పాట్‌హోల్ ఫ్రీ ఏపీ కార్యక్రమం (గుంతల రహిత రోడ్ల)లో భాగంగా కడప జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్, అధికారులతో కలిసి కడప నియోజకవర్గంలో ఎన్‌హెచ్-18 కడప రేణిగుంటను కలిపే రహదారి (సుబ్బిరెడ్డి కాలేజీ) దగ్గర ప్యాచ్ వర్క్ పనులకు పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర రహదారుల మరమ్మతులు, పునర్నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయన్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గాల వారీగా వాటిని మంజూరు చేశామన్నారు. రాష్ట్ర రహదారులు పనులు ఆరు కాగా, జిల్లా రహదారులు 86 మొత్తం 92 రహదారులకు నిధులు మంజూరు అయినట్లు తెలిపారు.వచ్చే ఏడాది జనవరి 15 నాటికి జిల్లాల్లోని అన్ని రహదారులను గుంతల రహిత రోడ్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. నిరంతరం అధికారులు పర్యవేక్షణ కొనసాగేలా ఉండాలన్నారు. ఆర్అండ్‌బీ ఎస్ఈ చంద్రశేఖర్, ఈఈ నాగేశ్వర్ రెడ్డి, డీఈలు, ఏఈలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

● శివాలయాలకు కార్తీక శోభ



ముస్తాబైన కడపలోని మోచంపేట శివాలయం

శివభక్తులకు ఎంతో ప్రియమైన కార్తీక మాసం వచ్చేసింది. ప్రత్యేక పూజలతో.. కార్తీక దీపాలతో శివాలయాలు కళకళలాడనున్నాయి. ఇప్పటికే పవిత్ర కార్తీక మాసం ప్రారంభమైందని చాటుతూ ఆయా ఆలయాల ధ్వజస్తంభాలపై కార్తీక దీపాన్ని వెలిగించారు. ఆకాశ దీపాన్ని ఎగురవేశారు. రేపు కార్తీక తొలి సోమవారం కోసం ఆయా ఆలయాల్లో అన్ని ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి.

-కడప కల్చరల్



మైదుకూరు: ఆకాశదీపానికి పూజలు చేస్తున్న భక్తులు

ఆకలి కేకలు!

కడప సెవెన్‌రోడ్స్: స్వచ్ఛభారత్ కింద గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారమై అనేక ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్న వేతనాలు చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నా ప్రభుత్వం పెడచెవిన పెడుతోంది. జిల్లాలో 557 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో ప్రతి 250 కుటుంబాలకు ఒకరు చొప్పున 1813 మంది గ్రీన్ అంబాసిడర్లు ఉన్నారు. వీరు ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ప్రతి ఇంటికి వెళ్లి చెత్తాచెదారాలు సేకరించి డంప్ యార్డులకు తరలిస్తుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన తొట్లలో తడి చెత్త, పొడిచెత్త వేర్వేరుగా నింపుతారు. చెత్తనంతా బాగా కుళ్లబెట్టి వానపాములను వదులుతారు. కొన్నాళ్లకు వానపాముల ఎరువు తయారవుతుంది. ఇలా చెత్త నుంచి సంపద సృష్టికర్తలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. మూగజీవాలు మరణిస్తే వాటిని కూడా తొలగించి శుభ్రపరచాల్సి ఉంటుంది. ప్రజారోగ్య పరిరక్షణలో వీరు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివి. వీరికి ప్రభుత్వం చాలీచాలని విధంగా రూ. 6 వేల వేతనంతో సరిపెట్టేది. పెరుగుతున్న జీవన వ్యయాన్ని దృష్టిలో పెట్టుకుని వేతనాలు పెంచాలంటూ అనేకమార్లు ప్రభుత్వాన్ని కోరుతూ వచ్చారు.



విధి నిర్వహణలో గ్రీన్ అంబాసిడర్లు

వీరి వ్యథలు అర్థం చేసుకున్న గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేతనాలను రూ. 6 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతూ జీఓ జారీ చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ ప్రభుత్వం వీరి వేతనాల గురించి ఇప్పటివరకు పట్టించుకున్న పాపాన పోలేదు.స్వచ్ఛతా హి సేవ, పల్లె పండుగ వంటి కార్యక్రమాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం పొందాలని చూస్తున్నదే తప్ప గ్రీన్ అంబాసిడర్ల ఆకలి కేకలు పట్టడం లేదనే విమర్శలు వినబడుతున్నాయి.

షెడ్లలో సౌకర్యాలు కల్పించాలి



చెత్త తరలించే షెడ్లలో నీళ్ల, ప్రహారీగోడలు, విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పించాలి. పెండింగ్‌లోఉన్న వేతనాలను విడుదల చేయాలంటూ పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు అధికారులు పట్టించుకోలేదు. గ్రామ పంచాయతీలను అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తామంటున్న ఉప ముఖ్యమంత్రి మా వేతనాల విషయం వచ్చేసరికి నిమ్మకుండిపోవడం బాధాకరం.

- ఎస్.కల్యాణ్, తిరువెంగళాపురం, బద్వేలు మండలం

ఆగిన పనులు ప్రారంభించాలి



గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛభారత్ మిషన్ కింద పనిచేసే కార్మికులకు నిలిచిపోయిన పనులు తిరిగి ప్రారంభించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలి. పనులు చేయించుకుంటూ వేతనాల గురించి పట్టించుకోకపోవడం విచారకరం. గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

- కేసీ బాదుల్లా, గౌరవాధ్యక్షులు, స్వచ్ఛభారత్ కార్మిక సంఘం, కడప

జిల్లాను కరువు జాబితాలో చేర్చాలి

- సర్పంచులకు బిల్లులు చెల్లించకుంటే ఆందోళన
- జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో సభ్యుల డిమాండ్



స్థాయీ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్ పర్సన్ శారద



సమావేశానికి హాజరైన జెడ్పీటీసీలు, జిల్లా అధికారులు

కడప సెవెన్‌రోడ్స్: ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడి రైతులు సాగు చేసిన పంటలు నిలువునా ఎండిపోయాయని.. జిల్లాను కరువు జాబితాలో చేర్చాలని సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం జెడ్పీ చైర్ పర్సన్ జె.శారద అధ్యక్షతన జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా మాట్లాడుతూ అధిక దిగుబడులు వస్తాయని అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపిన ఫలితంగా జిల్లా కరువు మండలాల జాబితాలో లేకుండా పోయిందంటూ ధ్వజమెత్తారు. ఈ విషయమై శనివారం 'కరువు రైతుపై కన్నెర్ర'శీర్షికన 'సాక్షి'దినపత్రికలో ప్రచురితమైన కథనాన్ని ఆయన ప్రస్తావించారు. తక్షణమే జిల్లాను కరువు జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. జెడ్పీ ఉపాధ్యక్షుడు బాలయ్య కూడా దీనికి మద్దతు తెలిపారు. కరువుతో రైతులు సర్వస్వం కోల్పోగా వ్యవసాయాధికారులు మాత్రం 33 శాతం కంటే పంట దిగుబడి అధికంగా వస్తుందంటూ నివేదికలు ఎలా పంపుతారని వ్యవసాయశాఖ జేడీ నాగేశ్వరరావును నిలదీశారు. ఇందుకు జేడీ బదులిస్తూ కరువున్న మాట నిజమేనని, అయితే కరువును నిర్ధారించే ఇండికేటర్స్ అనుకూలించలేదని తెలిపారు. జిల్లాలో ఒకచోట వర్షం కురుస్తుంటే అతి సమీప ప్రాంతంలో పడదని తెలిపారు. రానున్న రోజుల్లో ఒక మండలంలో నాలుగు చొప్పున రెయిన్‌గేజ్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. దీంతో మండలంలో కురిసిన సగటు వర్షపాతం ఖచ్చితంగా అంచనా వేసే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం కరీముల్లా మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించి మళ్లీ ప్రభుత్వానికి నివేదికలు పంపడం ద్వారా జిల్లా కరువు జాబితాలో చేరేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో సర్పంచులు రహదారులు, డ్రైనేజీ తదితర పనులు చేశారని తెలిపారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా నిలిపి వేసిందని ఆరోపించారు. ఇప్పటికైనా బిల్లులు చెల్లించేందుకు చర్యలు చేపట్టకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఏడేళ్ల క్రితం భవనాలు నిర్మించినా ఏపీఆర్ఐసీ బిల్లులు చెల్లించడం లేదని పోరుమామిళ్ల జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ తెలిపారు. జెడ్పీ నిధులు ఇస్తామన్నప్పటికీ ఆ శాఖ అధికారులు అంగీకరించడం లేదన్నారు. టేకూరుపేట హాస్టల్ 2016లో మూసి వేయడం వల్ల సుమారు 500 మంది విద్యార్థులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. తక్షణమే హాస్టళ్ల పునః ప్రారంభించాలని కోరారు. జిల్లాలోని షాదీఖానాలు రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారాయని కో ఆప్షన్ సభ్యుడు కరీముల్లా విమర్శించారు. అద్దె ఎవరువసూలు చేస్తున్నారో, ఏ అకౌంటులో జమ చేస్తున్నారో చెప్పాలని మైనార్టీ సంక్షేమశాఖ అధికారిని నిలదీశారు. గ్రావెల్ రవాణాకు అనుమతులు ఇవ్వాలని పోరుమామిళ్ల జెడ్పీటీసీ కోరారు. గ్రీన్ ఎంబాసిడర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరారు. ఇందుకు డీపీఓ బదులిస్తూ సర్పంచులతో సంప్రదించి వేతనాలు ఇప్పిస్తామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ప్రతి పంచాయతీకి బ్లీచింగ్ పౌడర్ కోసం నిధులు వచ్చేలా చూస్తామన్నారు. ఖాజీపేటలోని జెడ్పీ బాలుర పాఠశాలకు కాంపౌండ్ వాల్ నిర్మించాలని, ఆంజనేయకొట్టాలు, నెల్లూరు కొట్టాల స్కూళ్లకు భవన సౌకర్యాలు కల్పించాలని కో ఆప్షన్ సభ్యులు కోరారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ఇతర జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

చిరుద్యోగులపైనే చర్యలు

- అధికారులు ఎంత అవినీతికి పాల్పడినా చర్యలు ఉండవు
- సంచలనం రేపుతున్న అర్బన్ స్టేషన్ కానిస్టేబుల్ వాయిస్ మెసేజ్
- పోలీసు వర్గాల్లో తీవ్ర చర్చ



సస్పెండ్‌కు గురైన కానిస్టేబుల్ నాగసుబ్బయ్య

సాక్షి టాస్క్‌ఫోర్స్ : 'ఎస్ఐ, సీఐ స్థాయి అధికారులు ఎంత పెద్ద అవినీతికి పాల్పడినా వారిపై చర్యలు ఉండవు. కానిస్టేబుల్ స్థాయి చిరుద్యోగి చిన్న తప్పు చేసినా వెంటనే చర్యలు ఉంటాయి' బద్వేలు అర్బన్ స్టేషన్‌లో పనిచేస్తూ శుక్రవారం సస్పెండ్‌కు గురైన కానిస్టేబుల్ నాగసుబ్బయ్య (పి.సి.నెం. 2797) వాయిస్ మెసేజ్ ఇది. పోలీసు వాట్సాప్ గ్రూపులో పెట్టిన ఈ మెసేజ్ ప్రస్తుతం సంచలనంగా మారింది. దీనిపై పోలీసు వర్గాల్లోనూ తీవ్రమైన చర్చ నడుస్తోంది. స్థానిక అర్బన్ పోలీసు స్టేషన్‌లో నాగసుబ్బయ్య కొన్ని నెలలుగా పనిచేస్తున్నాడు. ఇటీవల మడకలవారిపల్లె సమీపంలో ఎలక్ట్రికల్ వస్తువులు విక్రయించే వారి వద్ద సదరు కానిస్టేబుల్ రూ.25 వేలు డబ్బులు అక్రమంగా తీసుకున్నట్లు అర్బన్ సీఐ రాజగోపాల్ దృష్టికి వచ్చింది. ఈ మేరకు విచారణ జరిపిన ఆయన నివేదికను ఎస్పీకి పంపించారు. ఈ క్రమంలో శుక్రవారం సదరు కానిస్టేబుల్ నాగసుబ్బయ్యను సస్పెండ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఈ వ్యవహారంపై కానిస్టేబుల్ నాగసుబ్బయ్య వివరణ ఇస్తూ పోలీసుల వాట్సాప్ గ్రూప్‌లోకి పంపిన వాయిస్ మెసేజ్ సంచలనంగా మారింది. అందులో అర్బన్ స్టేషన్ సీఐ రాజగోపాల్ జరిగిన విషయంపై న్యాయమా, అన్యాయమా అనేది తెలుసుకోకుండా తనపై రిపోర్టు పెట్టారని, అలాగే పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్నారని వాయిస్ మెసేజ్‌లో పేర్కొన్నారు. బి.మఠంకు చెందిన ఓ యువకుడికి సంబంధించిన ఫ్యామిలీ సమస్యలో అతని వాహనం తీసుకువచ్చి స్టేషన్‌లో పెట్టి ఓ కానిస్టేబుల్ ద్వారా పెద్ద మొత్తంలో నగదు వసూలు చేసినట్లు పేర్కొన్నాడు. అలాగే పట్టణంలోని రెండు బార్ల వద్ద, బియ్యం వ్యాపారి వద్ద నుంచి ప్రతి నెల పెద్ద మొత్తంలో మామూళ్లు తీసుకుంటున్నట్లు ఆరోపిస్తూ మెసేజ్ పెట్టారు. ఎస్ఐ, సీఐ స్థాయి అధికారి ఎంత పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడినా సంబంధిత ఎస్‌బీ అధికారులు ఎటువంటి విచారణ జరపరని వాయిస్ మెసేజ్ పెట్టారు. ఇటీవల దీపావళి సందర్భంగా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసేందుకు లైసెన్సుల కోసం దరఖాస్తులు చేసుకున్న వ్యాపారుల వద్ద నుంచి ఓ కానిస్టేబుల్ ద్వారా పెద్ద మొత్తంలో అక్రమంగా నగదు వసూలు చేసినట్లు సదరు కానిస్టేబుల్ ఆరోపించారు.

'జిల్లాలోని, మైదుకూరు సబ్ డివిజన్‌లోని కానిస్టేబుళ్లు.. అధికారుల మాటలు నమ్మి మోసపోవద్దు, ఏదైనా సమస్య జరిగితే కిందిస్థాయి ఉద్యోగులమైన మనపై నేరం మోపి వారు తప్పించుకుంటారు' అంటూ తోటి కానిస్టేబుళ్లకు హితబోధ చేయడం కొసమెరుపు.

క్లుప్తంగా

విద్యుత్ అక్రమ వినియోగదారులపై కేసులు

లింగాల : మండల కేంద్రమైన లింగాలలో శనివారం కడప నుంచి వచ్చిన విద్యుత్ శాఖ స్క్వాడ్ అధికారులు ఇంటింటా తనిఖీలు నిర్వహించారు. విద్యుత్ అక్రమ వినియోగదారులపై కేసులు నమోదు చేశారు. సుమారు 40 గృహాలకు అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు గుర్తించి వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని మృతదేహం



కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో గత నెల 30న గుర్తు తెలియని వ్యక్తి (35) చికిత్స నిమిత్తం చేరాడు. మరుసటి రోజునే 31న మృతి చెందాడు. అతని మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో ఉంచారు. ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా ఉంటే తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని రిమ్స్ అధికారులు తెలియజేశారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీకి శిక్షణ

– జెడ్పీ సీఈఓ ఓబులమ్మ

కడప ఎడ్యుకేషన్ : ఏపీ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయితీరాజ్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ప్రజా ప్రణాళిక ప్రచారం (2024–25) ద్వారా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీ ప్రక్రియకు సంబంధించిన జిల్లా స్థాయి టీఓటీఎస్ శిక్షణలను కడపలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ ఓబులమ్మ తెలిపారు. ఇందులో ఈ నెల 5, 6 తేదీలలో ఒక బ్యాచ్‌కు, 7, 8 తేదీలలో మరో బ్యాచ్‌లకు శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ రెండు బ్యాచ్‌ల ద్వారా జిల్లాస్థాయి ప్రజా ప్రతినిధులు, అధికారులు, టీఓటీలుగా ప్రతి మండలం నుంచి ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు, ఒక డిజిటల్ అసిస్టెంట్ చొప్పున శిక్షణ పొందుతారని తెలిపారు. శిక్షణ పొందిన వారు ఈ నెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు మండలాలలో ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, లైన్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులకు శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో పర్యవేక్షించేందుకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థకు చెందిన అధికారులు అబ్జర్వర్లుగా హాజరవుతారని సీఈఓ ఓబులమ్మ తెలిపారు.

నాలుగేళ్ల వరకు అవిశ్వాస తీర్మానం ఉండదు

- వ్యక్తిగత ప్రయోజనాల కోసమే కొందరు పార్టీని వీడారు
- నాతో ఉన్న వారే సిసలైన నాయకులు
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



జీఓ 835ను చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 2008 డిసెంబర్ 3న జారీ చేసిన జీఓ. 835 ప్రకారం కౌన్సిల్ ఏర్పడిన నాలుగేళ్ల వరకు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి అవకాశం లేదని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఆయన తన స్వగృహంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ నిబంధనల ప్రకారం 2025 మార్చి 18వ తర్వాతే అవిశ్వాస తీర్మానం కౌన్సిల్‌లో పెట్టవచ్చని తెలిపారు. ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్‌లో 41 మంది కౌన్సిలర్లతో పాటు ఇద్దరు కోఆప్షన్ సభ్యులు ఉన్నారన్నారు. 11వ వార్డుకు ఎన్నిక జరగలేదన్నారు. 40 మంది కౌన్సిలర్లతో పాటు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిలకు ఓటు హక్కు ఉందన్నారు. 2/3 మెజారిటీ ఉంటే అవిశ్వాస తీర్మానం పెట్టాలన్నారు. ఎన్నికల కంటే ముందే ఐదారుగురు కౌన్సిలర్లు పార్టీని విడిచి వెళ్లిపోయారని తెలిపారు. వారిని తాము వద్దనుకున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ఓటమి తర్వాత మరో 11 మంది టీడీపీలో చేరారన్నారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే టీడీపీకి 29 మంది కౌన్సిలర్ల మద్దతు అవసరమని తెలిపారు. అవగాహన లేకుండా కొన్ని మీడియాల్లో పాలకవర్గాన్ని దించివేస్తున్నారని కథనాలు పెట్టారన్నారు. శక్తివంతమైన మీడియాలో కూడా అవిశ్వాస తీర్మానంపై అవగాహన లేక ప్రసారం చేశాయన్నారు. నిబంధనల ప్రకారం మున్సిపల్ చైర్‌పర్సన్‌తోపాటు వైస్ చైర్మన్లను ఇప్పుడే దించే అవకాశం లేదన్నారు. పార్టీని వీడిన కౌన్సిలర్లు కూడా వారి వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీని వీడారే తప్ప తాను, తన పార్టీ నచ్చక కాదన్నారు. ఒక్కో కౌన్సిలర్‌ది ఒక్కో అవసరమని చెప్పారు. పార్టీ వదలిని వెళ్లిన వారికి అక్కడ మళ్లీ టికెట్ రాదని, భవిష్యత్తును కోల్పోతారన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైఎస్ చైర్మన్లు ఆయిల్ మిల్ ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మల్లేల రాజారాంరెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి ఏర్పాట్లు చేయాలి



పెద్ద దర్గా ప్రతినిధులతో మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : నగరంలోని మున్సిపల్ మైదానంలో ఈనెల 8వ తేదీ నుంచి నిర్వహించనున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి సంబంధించి అన్ని ఏర్పాట్లు ఈనెల 6వ తేదీకి పూర్తి కావాలని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన మున్సిపల్ మైదానాన్ని పరిశీలించారు. ఆర్మీ అధికారులు బస చేయడానికి ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఇందులో నగరపాలక సంస్థలోని ప్రతి విభాగానికి బాధ్యతలు అప్పగించారు. రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొనే వారికి వాష్ రూములు వంటి ఏర్పాట్లను చూసే బాధ్యత శానిటేషన్ అధికారులకు అప్పగించారు. ప్రోటోకాల్, ఫుడ్, స్నాక్స్ వంటి వాటి బాధ్యతలను రెవెన్యూ విభాగం అధికారులకు అప్పగించారు. సైనింగ్ బోర్డులు, ఆక్రమణల తొలగింపు బాధ్యతలను టౌన్‌ప్లానింగ్ అధికారులకు కేటాయించారు.

పెద్దదర్గా వద్ద..

అలాగే పెద్ద దర్గా చుట్టు పక్కల పరిశుభ్రమైన వాతావరణం కనిపించాలని, రాత్రివేళ జనం రద్దీగా ఉంటారని, తెల్లారే సరికి చెత్త పాయింట్లు శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లి ఉంచాలన్నారు. ఉరుసుకు వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

నాబిడ్డను వెతికిపెట్టి న్యాయం చేయండి సారూ..!

కమలాపురం : తన 14 ఏళ్ల మైనర్ బాలికను తన తోడి కోడలు రాధ వెంట తీసుకెళ్లిందని, ఇప్పటి వరకు తీసుకు రాలేదు. తన బిడ్డ ప్రాణంతో ఉందో లేదో కూడా తెలియడం లేదని, తనకు న్యాయం చేయండి సారూ.. అని మైనర్ బాలిక తల్లి ఆదిలక్ష్మి కన్నీటి పర్యంతం అవుతోంది. వివరాల్లోకి వెళితే.. కమలాపురం పట్టణం చెప్పలి రోడ్డులో ఉన్న వలస కార్మికులైన ఆదిలక్ష్మి గత కొంత కాలంగా కమలాపురంలోనే నివాసం ఉంటున్నారు. అయితే వరుసకు తోడి కోడలు అయిన రాధా తన 14ఏళ్ల కుమార్తెను కుట్టు మిషన్ వద్దకు పోయి వస్తామని బుధవారం తీసుకెళ్లిందని, ఇంత వరకు తన కూతురిని తీసుకు రాలేదని వాపోయింది. తన మేనల్లుడికి ఇచ్చి వివాహం చేయాలనే ఉద్దేశంతోనే రాధా తన కూతురిని తీసుకెళ్లిందని, తన కుమార్తెను తీసుకువచ్చి అప్పగించాలని ఆమె పోలీసులు ఎదుట వాపోయింది. ఈ విషయమై ఎస్ఐ ప్రతాప్‌రెడ్డిని వివరణ కోరగా బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

కమలాపురం : ఏడాది క్రితం జరిగిన హత్య కేసులో ముద్దాయిలను చాక చక్యంగా అరెస్ట్ చేసినట్లు సీఐ ఎస్‌కే రోషన్ తెలిపారు. శనివారం కమలాపురం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో హత్య కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. 2023 డిసెంబర్ 30వ తేదీన మైదుకూరు మండలం, శెట్టిపల్లెకు చెందిన దత్తలూరు పీరయ్యను అతని భార్య హుసేనమ్మ తన ప్రియుడు నేరెళ్ల ఆల్ఫ్రెడ్ అలియాస్ రాముడుతో కలసి హత్య చేసింది. హుసేనమ్మకు వివాహం కాక ముందు నుంచి మైదుకూరు మండలం పప్పనపల్లెకు చెందిన రాముడుతో పరిచయం ఉంది. అలాగే వారి మధ్య అక్రమ సంబంధం నడుస్తోంది. ఈ విషయం తెలిసిన మృతుడు పీరయ్య పలు మార్లు భార్యతో ఘర్షణ పడేవాడు. మృతుని అడ్డు తొలగించుకోవాలని చూస్తున్న వారు గత ఏడాది డిసెంబర్ 30న మద్యం మత్తులో ఉన్న పీరయ్యను ఆటోలో ఎక్కించుకుని మైదుకూరు టౌన్, ప్రొద్దుటూరు నుంచి కడపకు వెళ్లే బైపాస్ రోడ్డు లోని మూలబాట వీధికి పోవు సర్వీసు రోడ్డు దగ్గరికి తీసుకెళ్లి హత్య చేశారు. అనంతరం శవాన్ని కడప ఎయిర్‌పోర్ట్ దగ్గర ఉన్న పెద్ద కులాయిరెడ్డి లే-అవుట్‌లోని కంప చెట్లలో పడేశారు. మృతుని చేతిపై డి.సిద్ధేశ్వరమ్మ అనే పచ్చ బొట్టు ద్వారా మృతుడిని గుర్తించారు. హత్య చేసిన హుసేనమ్మ, రాముడు తమకు తెలిసిన వారెవరితో సంబంధాలు పెట్టుకోకుండా జమ్మలమడుగులో నివాసం ఉంటున్నారు. సీఐ రోషన్, ఎస్ఐ ప్రతాప్ రెడ్డి కలసి విచారణ చేపట్టి నిందితులను గుర్తించారు. వారిని శనివారం మైదుకూరు టౌన్ మూలబాట వీధి సర్వీస్ రోడ్డు వద్ద పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

నిద్రావస్థలో కూటమి ప్రభుత్వం

- సీఎం సొంత జిల్లాలో వరుస అత్యాచారాలు, హత్యలు
- ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



అట్లూరు : కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సొంత జిల్లాలో చిన్నారులపై వరుస అత్యాచారాలు, ఆపై హత్యలు జరుగుతున్నా ప్రభుత్వం నిద్రావస్థలో ఉందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అన్నారు. శనివారం ఆయన పోరుమామిళ్లలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తిరుపతి జిల్లా వడమాలపేట మండలం ఏఎం పురంలో మూడేళ్ల చిన్నారికి చాక్లెట్లు కొనిస్తానని మాయ మాటలు చెప్పి సుశాంత్ అనే యువకుడు అత్యాచారం చేసి ఆపై హత్య చేసిన ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఆ తల్లి దండ్రుల బాధలు వర్ణణాతీతమని, ఎన్నో నోములు నోచుకుని పిల్లలను కంటే వారిని చిన్న తనంలోనే చిదిమేస్తే తల్లి దండ్రులు తట్టుకోగలరా?. ఈ ప్రభుత్వం ఇక నైనా నిద్రలేవాలని పేర్కొన్నారు. ఇలాంటి అత్యాచారాలు హత్యలు ఆంధ్రప్రదేశ్‌లో తప్ప ఎక్కడా జరగలేదన్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి సొంత జిల్లాలో ఈ ఘటన జరిగిందన్నారు. మద్యం షాపులు విచ్చలవిడిగా ఏర్పాటు చేయడం వలనే మద్యం మత్తులో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఇప్పటికైనా మద్యం షాపులు తగ్గించి బెల్టుషాపులను పూర్తిగా లేకుండా చేయాలన్నారు. రాష్ట్రంలో గంజాయి విచ్చల విడిగా దొరుకుతోందన్నారు. డిప్యూటీ సీఎం సొంత జిల్లాలో 16 ఏళ్ల అమ్మాయికి మత్తు మందు ఇచ్చి చంపేశారు. ఇంత వరకూ డిప్యూటీ సీఎం ఆ కుటుంబాన్ని పరామర్శించలేదన్నారు. హిందూపురంలో అత్తా కోడళ్లపై అత్యాచారం చేస్తే అక్కడ ఉన్న ఎమ్మెల్యే ఆవైపు తొంగి చూడలేదు. ఇప్పటికైనా మీలో చలనం వచ్చి ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వైఎస్ జగన్ తీసుకొచ్చిన దిశా చట్టం అమలు చేసి మహిళలు, చిన్నారులపై హత్యలను నియంత్రించి రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడాలన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించడంతో పాటు బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

15న కలెక్టరేట్ ఎదుట మహాధర్నాకు పిలుపు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలను ప్రకటించాలని కోరుతూ ఈ నెల 15న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో కడప జిల్లాలోని ఏ ఒక్క మండలం కూడా లేకపోవడం చూస్తుంటే రాజకీయ కక్ష సాధింపు చర్యలాగా ఉందన్నారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో ఐదు నియోజకవర్గాల్లో టీడీపీని ప్రజలు గెలిపించారని గుర్తు చేశారు. కే.సీ. కెనాల్ పరివాహక 8 మండలాల మినహా, జిల్లా అంతట కరువు తాండవిస్తోందని తెలిపారు. కరువు నివేదికను అధికారులు గుడ్డిగా ఎలా పంపిస్తారని ప్రశ్నించారు. జిల్లాలోని 28 మండలాలలో పంటల దిగుబడి 25 శాతం లోపే ఉందని, వర్షపాతం 98.5 మిల్లీమీటర్లకు లోపు ఉంటే కరువు మండలాలుగా ప్రకటించాలని నిబంధనలు తెలుపుతుతున్నాయన్నారు. జిల్లాలోని 28 మండలాలలో 33 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే కురిసిందని వాతావరణ శాఖ తెలిపినట్లు వారు గుర్తు చేశారు. జిల్లా రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా, రుణ రీ షెడ్యూల్, వంటి లబ్ధి జరగకుండా ఉద్దేశపూర్వకంగానే రాష్ట్ర ప్రభుత్వం అధికారుల ద్వారా తప్పుడు నివేదికలు తెప్పించుకొని చేసినట్లుగా భావించాల్సి వస్తుందని వారు విమర్శించారు.

11న జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన



కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్రంలో ఇసుకను ఉచితంగా ఇవ్వాలని కోరుతూ ఈ నెల 11న జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడుతున్నట్లు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎల్ నాగసుబ్బారెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె లింగన్న పేర్కొన్నారు. శనివారం నగరంలోని అప్సర సర్కిల్‌లో కలెక్టరేట్ ఆందోళన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం గెలిస్తే ఇసుక పాలసీని మారుస్తామని, అందరికీ ఇసుక ఉచితంగా ఇస్తామని, సంక్షేమ బోర్డును పునః ప్రారంభించి భవన నిర్మాణ కార్మికుల ఆదుకుంటామని హామీ ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇచ్చిన హామీలన్నీ మరచిపోయారన్నారు. కొత్త ఇసుక పాలసీని తెచ్చినా ప్రజలకు ఇసుక ఉచితంగా రావడం లేదన్నారు. రాష్ట్రంలో 110 ఇసుక ర్యాంపులు ఉంటే 76 ర్యాంపులు మాత్రమే ఓపెన్ చేశారన్నారు. మిగతా 34 రీచ్‌లలో ఇసుక స్టాక్ లేక వెలవెల పోతున్నాయన్నారు. నిన్న మొన్నటి వరకు ఇసుకపైన జీఎస్టీ పన్ను, సీనరేజ్, ఇతర ఫీజు వసూలు చేశారు, ఇప్పుడేమో అన్ని రద్దు చేసామంటే ఎలా నమ్మాలన్నారు. ఇసుక ర్యాంపులను ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వడం అంటే అక్రమ వ్యాపారానికి అవకాశం ఇవ్వడమే అని అర్థమవుతుందన్నారు. తక్షణం జీవో 66 ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కెసి. బాదుల్లా, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఈశ్వరయ్య సుంకన్న,మద్దిలేటి, పాములేటి పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ అరెస్టు

70.5 గ్రాముల బంగారు గొలుసులు, రెండు బైకులు స్వాధీనం



చైన్ స్నాచర్ అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్

మైదుకూరు : పలు చోట్ల మహిళల మెడలోని బంగారు గొలుసులను లాక్కెళ్లిన ఓ చైన్ స్నాచర్‌ను మైదుకూరు అర్బన్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.6.68 లక్షల విలువైన 70.5 గ్రాముల బంగారు గొలుసులను, రెండు మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. శనివారం మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ తన కార్యాలయంలో ఆ వివరాలను వెల్లడించారు. కడప నగరంలోని మోచంపేట వీధికి చెందిన షేక్ ఆజాంఆలీ సేట్ అలియాస్ సేట్ మహిళలను లక్ష్యంగా చేసుకొని వారి మెడలో ఉన్న బంగారు ఆభరణాలను లాక్కొని దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఇటీవల దసరా ఉత్సవాల్లో మైదుకూరు మున్సిపాలిటీలోని లింగాలదిన్నెకు చెందిన భూమిరెడ్డి వెంకట రాధ దైవదర్శనం కోసం మైదుకూరుకు వచ్చింది. స్థానిక అమ్మవారిశాల వద్ద నిలుచుని ఉండగా మోటార్ బైక్‌పై వచ్చిన అగంతకుడు ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన అర్బన్ పోలీసులు శనివారం షేక్ ఆజాం ఆలీ సేట్‌ను పట్టుకున్నారు. ఇతను మైదుకూరులో, ప్రొద్దుటూరు 2వ పోలీస్‌స్టేషన్ పరిధిలో, అన్నమయ్య జిల్లా మన్నూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తెలిసింది. అతని వద్ద నుంచి రెండు మోటార్ బైక్‌లతోపాటు 19 గ్రాములు, 20 గ్రాములు, 16.450 గ్రాముల బరువు ఉన్న మూడు బంగారు గొలుసులతోపాటు 20 గ్రాముల నల్లపూసల దండను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పార్కింగ్ చేసిన మోటార్ బైకులను ఎత్తుకెళ్లే ఆజాం ఆలీ అదే బైక్‌లపై ప్రయాణిస్తూ మహిళల మెడలోని గొలుసులను లాక్కెళుతుంటాడని తెలిపారు. ఇతనిని పట్టుకొని చోరీ చేసిన బంగారు ఆభరణాలతోపాటు, మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకునేందుకు కృషి చేసిన మైదుకూరు అర్బన్ సీఐ సయ్యద్ హాసం, ఎస్ఐ బి.ఘన మద్దిలేటి, హెడ్ కానిస్టేబుల్ సీహెచ్‌వీ రమణ, శివగణేష్, నవీన్, తిరుమలయ్యలను అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు.

కుక్కల దాడిలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు



గాయపడిన వృద్ధురాలు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని దూదేకులవీధిలో శనివారం ఓ వృద్ధురాలిపై కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో వృద్ధురాలికి రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని కొండారెడ్డివీధికి చెందిన సుబ్బమ్మ అనే వృద్ధురాలు ఓ పని నిమిత్తం దూదేకులవీధిలోని తన సమీప బంధువుల ఇంటికి వచ్చింది. అక్కడ పని ముగించుకుని తిరిగి వెళుతున్న సమయంలో ఒక్కసారిగా కుక్కలు దాడి చేశాయి. చుట్టు పక్కల వారు వారిస్తున్నా దాడి చేయడంతో రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా రక్తస్రావం అవుతుండటంతో భయాందోళనకు గురైన ఆ వృద్ధురాలు అయ్యా... నాకు ముందే ఆరోగ్యం బాగా లేదు. త్వరగా ఆసుపత్రిలో చేర్పించండి అంటూ అక్కడి వారిని చేతులెత్తి మొక్కుతూ వేడుకోవడం కలచివేసింది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పట్టణంలో కుక్కలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు. అనంతరం వృద్ధురాలి కుటుంబ సభ్యులు ఆమెకు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేర్పించారు.

గండి క్షేత్రం వద్ద స్కార్పియో దగ్ధం



వాహనంలో చెలరేగిన మంటలు

చక్రాయపేట : అంజన్న దర్శనం నిమిత్తం అట్లూరు నుంచి వచ్చిన స్కార్పియో వాహనం గండి క్షేత్రంలో దగ్ధమైంది. ఏసీ వైర్లు షార్ట్ సర్క్యూట్ కారణంగా స్కార్పియోలో మంటలు చెలరేగినట్లు వాహన యజమానితో పాటు భక్తులు పేర్కొన్నారు. వివరాలు ఇలా.. అట్లూరు మండలం పాత అట్లూరు గ్రామానికి చెందిన మన్నూరు నరసింహ ఏపీ13 బీయు 0349 స్కార్పియోలో కుటుంబ సభ్యులతో కలిసి శనివారం గండికి వచ్చాడు. వాహనాన్ని అర్చకుల నివాస గృహాల వద్ద ఆపి అందరూ స్వామి దర్శనానికి వెళ్లారు. ఆ సమయంలో ఒక్కసారిగా వాహనం లోపలి నుంచి దట్ట మైన పొగలతో పాటుగా మంటలు వచ్చాయి. ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ చైర్మన్ వెంకటస్వామి, ఆలయ సహాయ కమిషనర్ వెంకట సుబ్బయ్య, సిబ్బంది, ఆర్కేవ్యాలీ పోలీసులు భక్తులను దూరంగా పంపించివేశారు. ప్రధాన, ఉపప్రధాన అర్చకులు కేసరి, రాజారమేష్‌ల ఇళ్లలోని కుళాయి పైపులతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అంతలోనే వేంపల్లె అగ్నిమాపక యంత్రం వచ్చి మంటలను పూర్తిగా ఆర్పివేసింది.

వ్యాయామంతో మరింత మెరుగ్గా ఆరోగ్యం



వ్యాయామశాల పునః ప్రారంభించిన వైద్యాధికారులు

కడప అర్బన్ : ప్రతి ఒక్కరూ వ్యాయామం అలవర్చుకోవాలి. వ్యాయామంతో ఆరోగ్యం మరింత మెరుగ్గా వుంటుందని కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్, అడిషనల్ డీఎంఈ డాక్టర్ ఏ. సురేఖ అన్నారు. శనివారం కళాశాలలోని వ్యాయామశాలను మళ్లీ ప్రారంభించారు. కరోనా ముందు వరకు వ్యాయామశాలను అందరూ ఉపయోగించుకునేవారు. తరువాత మరింత ఆధునికంగా వ్యాయామశాలను తీర్చిదిద్ది పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వ్యాయామం ప్రతి వైద్య విద్యార్థి అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మెడికల్ సూపరింటెండెంట్, సూపర్ స్పెషాలిటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. సురేశ్వర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ (అకడమిక్) డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ (అడ్మినిస్ట్రేటివ్) డాక్టర్ బి. లక్ష్మీ నరసమ్మ, అధ్యాపక సిబ్బంది, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్

కడప అర్బన్ : జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రెటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి చాంబర్‌లో న్యాయమూర్తులకు ముందస్తు జాతీయ లోక్ అదాలత్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిసెంబర్ 14వ తేదీన జరుగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేవిధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సెకండ్ క్లాస్ కోర్టు న్యాయమూర్తులు పాల్గొన్నారు.

కేసుల పురోగతిపై దృష్టి సారించాలి

జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు



పెండ్లిమర్రిలో పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప అర్బన్ : పోలీసు స్టేషన్ పరిధిలో నమోదైన కేసులకు సంబంధించి ఎప్పటికప్పుడు పురోగతి సాధించేందుకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు తెలియజేశారు. కడప తాలూకా, సెంట్రల్ క్రైమ్, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లను జిల్లా ఎస్పీ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కడప తాలూకా పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడి వారి విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. సి.సి.టి.ఎ.ఎస్, కోర్టు కానిస్టేబుళ్లతో మాట్లాడి వారి వృత్తి పరంగా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. స్టేషన్‌లో ఉన్న సిబ్బందిలో నైపుణ్యాలను గుర్తించి వారికి తగిన విధులు కేటాయించాలని తాలూకా సీఐ వెంకటేశ్వర్లును ఆదేశించారు. విచారణలో ఉన్న కేసుల పురోగతిని సీఐని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన విచారణ పూర్తి చేయాలని ఆదేశించారు. మహిళలపై నేరాలు సైబర్ నేరాలపై విద్యాసంస్థల్లో అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. జిల్లా పోలీసుశాఖ రూపొందించిన చెక్‌లిస్ట్ మేరకు ప్రతి కేసుకు సంబంధించిన వివరాలు సీడీ ఫైల్‌లో ఉంచి దర్యాప్తు ప్రక్రియ సజావుగా జరిగేలా, దర్యాప్తు నైపుణ్యం పెంపొదించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ క్రైమ్ సెల్‌ను తనిఖీ చేశారు. సిబ్బంది విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. సోషల్ మీడియా అసత్యాలు, అభ్యంతకర పోస్టులు పెట్టేవారిపై నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎస్.ఎం అలీని ఆదేశించారు. సైబర్ నేరాలపై బాధితుల ఫిర్యాదులపై సత్వరం స్పందించాలని ఆదేశించారు. సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. చోరీ కేసులను త్వరితగతిన ఛేదించాలన్నారు. సస్పెక్ట్ షీట్ రికార్డులను అప్‌డేట్ చేసి డేటాను కంప్యూటర్‌లోని నిక్షిప్తం చేయాలన్నారు. ఈ తనిఖీలలో కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఆయా పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసి ఎస్పీ

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి పోలీసు స్టేషన్‌ను శనివారం ఎస్పీ హర్షవర్ధన్ రాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన విచారణ చేయాలన్నారు. బహిరంగ మద్యపానం జరిగే ప్రదేశాలను గుర్తించి దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఎస్ఐని ఆదేశించారు. రోడ్డు భద్రత నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కడప రూరల్ సీఐ చల్లని దొర, ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.